క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ర్యాంకర్‌కు సన్మానం



నారాయణపేట రూరల్: ఇటీవల విడుదలైన ఇంటర్ ఇంప్రూమెంట్ పరీక్షల్లో జిల్లాకు తొలిసారి రాష్ట్ర స్థాయి ఫస్ట్ ర్యాంకు వచ్చింది. పట్టణానికి చెందిన గొడుగు దీపిక స్థానిక ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంపీసీ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. 470 మార్కులకు గాను 468సాధించి ఉమ్మడి రాష్ట్ర స్థాయి ఫస్ట్ ర్యాంకు సాధించింది. సోమవారం ఆమెను మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ్‌బట్టడ్, పలువురు సన్మానించి, అభినందించారు.

సాగునీటి విడుదల



ధన్వాద: పెద్ద చెరువు తూము నుంచి సోమవారం సర్పంచ్ అమరేందర్‌రెడ్డి నీటి విడుదల చేశారు. వరి నాట్లు వేసిన రైతుల విజ్ఞప్తి మేరకు తూము ద్వారా పంట పొలాలకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. దీంతో 1200 ఎకరాలు తడవనున్నాయని, నీటి విడు దలపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. రైతులు పటేల్ నర్సింహులు, వెంకటేష్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

స్వీపర్లకు కనీస వేతనం చెల్లించాలి

నారాయణపేట: పాఠశాలలో విధులు నిర్వహించే స్వీపర్లకు కనీస వేతనం రూ.27 వేలు చెల్లించాలని టీడీపీ రాష్ట్ర నాయకులు కే ఓం ప్రకాశ్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 50 రోజులుగా హక్కుల కోసం స్వీపర్లు ధర్నా చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లు అవుతున్న స్వీపర్లను పట్టించుకోకపోవడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి స్వీపర్లకు కనీస వేతనం రూ. 27 వేలు చెల్లించాలని, లేనిపక్షంలో వారికి మద్దతుగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు యాబన్నచౌదరి, ఉద్దినారాయణ, భీమన్న, పెంటయ్య, రాములు యాదవ్, భాస్కర్, కనకప్ప, వీరన్నగౌడ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నారాయణపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన నారాయణపేట జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఎక్లాస్‌పూర్‌కు చెందిన నడిపి ఉసేనప్ప (26) ఈ నెల 8న రాత్రి పట్టణంలో పనులు పూర్తి చేసుకుని సొంత గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో ఐటీఐ కళాశాల సమీపంలో మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీన్ని గమనించిన వాహనదారులు అతన్ని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మహబూబ్‌నగర్ తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన సోమవారం సాయంత్రం మృతిచెందాడు. ఆయన తండ్రి వెంకటప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాల ఆవరణలో విరిగిన చెట్టుకొమ్మ

అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న వేప చెట్టు కొమ్మ అకస్మాత్తుగా విరిగి పడింది. కొమ్మ విరిగి పడిన సమయంలో చెట్టు కింద విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పాఠశాల ఆవరణలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న వేప చెట్టు నీడలో విద్యార్థులు కూర్చొని చదువుకునేవారు. కొంత కాలంగా వేప చెట్లకు వైరస్ సోకడంతో కొమ్మలు బలహీనమై చిన్నపాటి గాలులకు సైతం విరిగిపడుతున్నాయి. ఈక్రమంలోనే సోమవారం ఉదయం పాఠశాల సమయానికి ముందే చెట్టు కొమ్మ విరిగి పడటంతో ప్రమాదం తప్పిందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్

అమరచింత: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాలను నిలబెట్టే స్థాయికి ఎదగాలని రిటైర్డ్ హెచ్‌ఎం గోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉచితంగా బూట్లను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించానని, తన కుమారులు ఇదే పాఠశాలలో చదివి ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బలరాముడు, పాఠశాల చైర్మన్ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు



నూతన దుస్తులను అందజేసిన మార్కెట్ చైర్‌పర్సన్ మొసటి జ్యోతి

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుకు వివిధ ప్రాంతాల నుంచి పంటలు తీసుకొచ్చి విక్రయించే రైతులకు యార్డు అధికారులు, దడవాయిలు, హమాలీలు, చాటా కూలీలు ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మొసటి జ్యోతి సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం మార్కెట్ యార్డులో దడవాయిలు, హమాలీలు, చాటా కూలీలకు నూతన దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రతి రైతు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసమే రైతు బంధు, రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్కెట్ యార్డులో పనిచేస్తున్న దడవాయిలు, హమాలీలు, చాటకూలీలకు కొత్త దుస్తువులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, జెడ్పీటీసీ అంజలి, పేట సింగిల్ విండో అధ్యక్షుడు నరసింహారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీకాంత్, ఊట్కూర్ సింగిల్ విండో అధ్యక్షుడు ఎం.బాల్‌రెడ్డి, జగదీశ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ



టై, బెల్టులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ యశోదమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు టై బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన జరుగుతుందన్నారు. విద్యార్థులకు రెండు జతల దుస్తులు, టై, బెల్ట్, బ్యాడ్జి, పుస్తకాలు, మధ్యాహ్నం పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్లు నర్సింహులు, మక్బుల్ ఖాన్, ఉపాధ్యాయులు పద్మ, సునీత, వెంకటప్ప, సలాం తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



కళాకారులతో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మాగనూర్: ఓటు హక్కు తప్పకుండా వినియోగించుకోవాలని మాగనూర్ రెవెన్యూ ఆర్‌ఐ శ్రీశైలం అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్‌ఓ మండలంలోని కొత్తపల్లిలో కళాకారులతో ఓటు హక్కు, ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. కళాకారులు పాటలు పాడుతూ ఓటు వజ్రాయుధం, ఓటు విలువైనది, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని, వచ్చే ఎన్నికల్లో విధిగా ఓటు వెయ్యాలని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిమ్మప్ప, గ్రామస్తులు వీఆర్‌ఏ యాదయ్య, చల్లా లక్ష్మి, శాంతమ్మ, ఎర్ర నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంల సమ్మె నోటీసు అందజేత



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న రెండో ఏఎన్‌ఎం సభ్యులు

మాగనూర్: రెండో ఏఎన్‌ఎంలందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్‌కు ఏఎన్‌ఎం సంఘం సభ్యులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు వరలక్ష్మి మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలకు రాత పరీక్ష విధానం రద్దు చేయాలన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న వారినే రెగ్యులరైజ్ చేసి, ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. గత నెల 31న ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎం సంఘం సభ్యులు గిరిజ, రామేశ్వరి, సుధ, శారద, రజిని, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: రెండో ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ సునీతకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రెండో ఏఎన్‌ఎం సంఘం మండల అధ్యక్షురాలు స్వరూప మాట్లాడుతూ తమ ఉద్యోగ్యలను రెగ్యులరైజ్ చేసే వరకు తమ పోరాటం ఆగదన్నారు. వెంటనే ప్రభుత్వం రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గీత, శోభారాణి, వరలక్ష్మి, అనంతమ్మలు పాల్గొన్నారు.

జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ



ఊట్కూరులో తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేట: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆజాదికా అమృత ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగరేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జీకే నర్సింహులు యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పేరపళ్లలో 50 ద్విచక్రవాహనాలకు జాతీయ జెండాలు కట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామంలో జాతీయజెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూత్ కమిటీ అధ్యక్షుడు కిష్టప్ప, బోయిని రాములు, హనుమాన్ సేవ సమితి సభ్యులు ఓబన్న, వెంకటప్ప, బస్సప్ప, బాలప్ప, అంజప్ప పాల్గొన్నారు.

ఊట్కూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఊట్కూరులో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఘర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భాగంగా జాతీయ జెండాలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశ ఐక్యతను చాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హనుమంతు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, బీజేపీ మండలాధ్యక్షుడు రమేష్, నాయకులు ఆశప్ప, లింగం, రమేష్, రణవీర్, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాద: మేరా మిట్టీ మేరా దేశ్‌లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో జాతీయ జెండాలతో బీజేపీ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా బురుజుగడ్డ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద మట్టికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బస్‌స్టాండ్ నుంచి జాతీయ పథకంతో పూర విధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, మండల అధ్యక్షుడు మాకం సురేందర్, సీనియర్ నాయకులు ఉదయభాను, రాంచంద్రయ్య, శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్, శ్రీను, నారాయణ, శంకర్, కురుమూర్తి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీని అధికారంలోకి తీసుకొద్దాం



పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

నర్వ: రాష్ట్రంలో నిరంకుశ ప్రభుత్వాన్ని గద్దెదింపి, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొద్దామని ఎన్ఆర్ఐ కోర్ కమిటీ సభ్యులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉందేకోడ్‌లో ఆయన కార్యకర్తలను కలిసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడాలన్నారు. గడప గడపకు కాంగ్రెస్ పార్టీని తీసుకెళ్లేందుకు గ్రామాల్లో యువతను చైతన్యం చేస్తామన్నారు. అనంతరం ఆయనను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ నాయకులు అశోక్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, మహేందర్, ఎల్లయ్యగౌడ్ ఉన్నారు.

జాతీయ జెండాల అందజేత



విద్యార్థులకు జాతీయ జెండాలను అందజేసిన ఆర్టీఐ రక్షణ కమిటీ సభ్యులు

మరికల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సమాచార హక్కు రక్షణ చట్టం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు జాతీయ జెండాలను అందజేశారు. బాలుర, బాలికల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ గోవర్ధన్, ఉమ్మడి జిల్లా ఆర్టీఐ రక్షణ కమిటీ సలహాదారుడు శివయ్య వందమంది విద్యార్థులకు జెండాలు అందజేశారు. జెండాలను ఇళ్లపై ఏర్పాటు చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దత్తాత్రి, అంజయ్య, సతీష్, రాములు, కిశోర, సాయి వెంకటేష్‌లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మరికల్: పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు చిన్న మొగులప్ప(43) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మొగులప్ప అంత్యక్రియలకు సర్పంచ్ గోవర్ధన్ రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్మికుడి మృతి పట్ల తోటి కార్మికులు నివాళులర్పించారు.

బొడ్రాయి ప్రతిష్ఠ



మాగనూర్(మక్తల్): మక్తల్ పట్టణంలోని పడమటి అంజనేయస్వామి బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పట్టణంలోని బ్రాహ్మణవాడిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పుర ప్రముఖులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నలుమూలల పడమటి ఆంజనేయస్వామి ఆలయం వద్ద, కర్ని రోడ్డులోని బాలాంజనేయ స్వామి ఆలయం వద్ద, నాలుగు చోట్ల బొడ్రాయి ప్రతిష్ఠ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బాల్చేడ్ మల్లికార్జున్, నాయకులు వాకిటి శ్రీహరి, సభ్యులు రాజుల ఆశిరెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, కావలి వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి, జుట్ల శంకర్, చిన హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

మండల ఏర్పాటు జీఓ ఇప్పించండి

నారాయణపేట రూరల్: అన్ని అర్హతలున్న కోటకొండను మండలంగా ఏర్పాటు చేస్తూ జీఓ విడుదల చేయించాలని ఎంపీటీసీ సభ్యురాలు కెంచె అనసూయ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కోటకొండలో 97వ రోజు నిరసన దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలు, మండలాలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన వెంటనే కోటకొండకు అవకాశం కల్పించలేదని విమర్శించారు. అన్ని అర్హతలున్న కోటకొండను మండలం చేయాలని ప్రతిపాదనలు పంపినా తెలంగాణ ప్రభుత్వం ఎందుకు తిరస్కరించిందని ప్రశ్నించారు. ఇటీవల ఎన్నో గ్రామాలను మండలాలుగా చేసిన సీఎం కేసీఆర్ కేవలం రాజకీయ లబ్ధి కోసమే కోటకొండపై వివక్ష చూపుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, బీజేపీ నాయకులు కెంచె శ్రీనివాసులు, చెన్నప్పయాదవ్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు రాము, యాదగిరి, రాజు, వెంకట్రాములు, కాశన్న, నారాయణ, కిష్టప్ప పాల్గొన్నారు.

కార్యాలయాలు ముస్తాబు



ఊట్కూరు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో సోమవారం ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా రంగురంగుల కాగితాలతో అలంకరించారు. విద్యార్థులు తరగతి గదులను అలంకరించారు. ఊట్కూరు, పులిమామిడి, చిన్నపొర్ల, బిజ్వార్, అవుసలోనిపల్లి, పగిడిమారి తదితర గ్రామాల్లోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రంగురంగు కాగితాలతో అలంకారాలతో ముస్తాబవుతున్నాయి.

జెండా పండుగకు సర్వంసిద్ధం..

నర్వ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండలంలో మువ్వన్నెల జెండాలు ఎగరనున్నాయి. ఇందుకోసం మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలను ముస్తాబు చేశారు. మండల కేంద్రంలోని ప్రతి స్తంభానికి మువ్వన్నెల జెండాలను పంచాయతీ సిబ్బందితో కట్టించారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించడంతో శోభాయమానంగా కనిపిస్తున్నాయి. జెండా పండుగ కోసం ముస్తాబు చేస్తుండడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది.

దశల వారీగా రాష్ట్ర అభివృద్ధి



దాసర్‌దొడ్డిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

● ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్(మక్తల్): మక్తల్ మండలంలోని దాసర్‌దొడ్డిలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో మిషన్ భగీరథ వాటర్‌ట్యాంక్, పాఠశాలలో అదనపు తరగతి గదులు ప్రారంభించారు. ప్రధాన వీధులో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం దశలవారిగా అభివృద్ధి చెందుతుందన్నారు. గడిచిన 9 ఏళ్ల కాలంలో రాష్ట్రం అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణ: నూతనంగా ఏర్పడిన కృష్ణ మండలం వనరులకు ప్రధాన కేంద్రంగా ఉందని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పూర్ణిమ్మ పాటిల్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మండలంలో ప్రధానంగా రెండు నదులు, రెండు రైల్వే లైన్లతో అభివృద్ధికి కేంద్ర బిందువుగా ఉందన్నారు. ప్రజలు, నాయకులు మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. మండలంలోని నూతన గ్రామ పంచాయతీ భవనాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ అమ్మక్క మాట్లాడుతూ గురుజాలలో అంగన్‌వాడీ సెంటర్ లేక పాఠశాలలో నడుపుతున్నామని, పాఠశాల పెచ్చులు ఉడిపోతున్నాయని తెలిపారు. దీనివల్ల పిల్లలకు ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి సొంత భవనం కేటాయించాలని కోరారు. నదీతీర ప్రాంతాలైన కృష్ణ, గుడేబల్లూర్, మూడుమాల్ గ్రామాల్లో మొక్కలు నాటి పచ్చదనంతో తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే అన్నారు. కొన్ని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అంజనమ్మపాటిల్, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, ఈశ్వరగౌడ, సావిత్రి, నాగప్ప, రాధామహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమల జీవితాల్లో వెలుగులు..

మాగనూర్(మక్తల్): గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం సత్ఫలితాలిస్తోందని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మక్తల్ పట్టణానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు ఉచిత గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గొల్ల, కురుమలను పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మక్తల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల తొలగింపు సరికాదు



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నారాయణపేట: మధ్యాహ్నభోజన కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యాధికారి కార్యాలయ సూపరింటెండెంట్ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు బాల్‌రాం మాట్లాడుతూ జిల్లాలోని గుండుమాల్ మండల పరిధిలోని భద్రాయపల్లి, భక్తిమాల గ్రామాల్లో మధ్యాహ్న భోజనం వండకుండా రెండు వారాల కార్మికులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. మధ్యాహ్న భోజన మొదలైనప్ప నుంచి నేటి వరకు అతి తక్కువ వేతనంతో కార్మికులు పనిచేస్తున్నారని, ఇప్పుడు గౌరవ వేతనం ఏర్పాటు చేశాక వారిని తొలగించి వేరే వాళ్లను పెట్టుకుంటామని చెప్పడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్, కోస్గి మండల మధ్యాహ్న భోజన కార్మికులు వెంకటమ్మ, అంజిలమ్మ, సుశీలమ్మ పాల్గొన్నారు.

కోస్గి: ప్రభుత్వ పాఠశాలల్లో కొన్ని ఏళ్లుగా అరకొర వేతనాలకు పని చేసిన మధ్యాహ్న భోజన కార్మికులను కొన్ని చోట్ల తొలగిస్తున్నారని, ఇలాంటి తొలగింపు చర్యలను ఆపాలని సోమవారం సీఐటీయూ నాయకులు డీఈఓకు వినతి పత్రం అందజేశారు. గుండుమాల్ మండలంలోని బలభద్రాయపల్లి, భక్తిమళ్ల పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండకుండా రెండు వారాలుగా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సర్పంచులు, చైర్మన్లు ముకుమ్మడిగా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో మండల విద్యాశాఖ అధికారికి సైతం ఫిర్యాదు చేశామన్నారు. అరకొర వేతనాలకు పని చేసిన వారిని తొలగించి ప్రస్తుతం ప్రభుత్వం గౌరవ వేతనం పెంచడంతో కొత్త వారిని తీసుకునేందుకు సిద్ధమవుతున్నారన్నారు. జిల్లా అధికారులు ఈ విషయంలో సమగ్ర విచారణ చేసి పాత వారినే కొనసాగించాలని, లేని పక్షంలో కార్మికులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఇందులో సీఐటీయూ నాయకుడు బల్‌రాం, కేవీపీఎస్ నాయకుడు వెంకట్, కార్మికులు ఉన్నారు.

బహుజన రాజ్యాధికారానికి కృషి చేయాలి



ఆర్‌ఎస్పీని కలిసిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నర్మద

కోస్గి: అన్ని కులాలు, మతాలను కలుపుకొని బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచించినట్లు కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నర్మదకిష్టప్ప తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఎస్పీ కార్యాలయంలో ఆయన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని స్థితిగతులను ఆయన తెలుసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. నూతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆమెతో పాటు మహిళా కన్వీనర్ సత్యమ్మ ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ బద్రీనాథ్

నారాయణపేట: మత్తు పదార్థాలు డ్రగ్స్, గంజాయి, గుట్కా, మద్యపానం వంటి వాటికి దూరంగా ఉండాలని ఎస్‌ఐ 2 బద్రీనాథ్ ప్రజలకు సూచించారు. సోమవారం మండలంలోని శేర్నపల్లిలో పోలీస్ కళాబృందంతో సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల జరిగే అనార్థాలు, అంటరానితనం, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, షీ టీమ్స్, ట్రాఫిక్ చట్టాలు, సీసీ కెమెరాలపై పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల అనారోగ్యం పాలవుతారని, వాటికి బానిసలైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కి 100కి డయల్ చేయాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలు అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, కానిస్టేబుళ్లు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రుక్యానాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బందోబస్తు

జిల్లా కేంద్రంలోని ఓ థియేటర్‌లో గాంధీ చలన చిత్రాన్ని వీక్షించేందుకు వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు పోలీసుశాఖ బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్త్‌లో ఎస్‌ఐ వసంత, కానిస్టేబుల్ శివ ఉన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి

మద్దూరు: గ్రామ పంచాయతీ కార్మికులకు సోమవారం ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ అరుణలు దుస్తులను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న 24 మంది కార్మికులకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒక్కో జత దుస్తులను అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వారి సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాదవరెడ్డి, వార్డు సభ్యులు నర్సింహులు, శేఖర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.